క్లుప్తంగా

తాగునీటి పైపులైన్ ఏర్పాటు



పైపులైను పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక బీసీ కాలనీలో మంగళవారం సర్పంచ్ గంగాధరం ఆధ్వర్యంలో తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేశారు. కాలనీలో నూతనంగా వేసిన బోరు నుంచి 200 మీటర్ల మేరకు పైపులైను ఏర్పాటు చేసి గ్రామస్తులకు తాగునీటిని అందించి, సమస్యను పరిష్కరించారు. అలాగే ఎస్సీ కాలనీలో నూతన బోరు వేసి చేతి పంపును ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



మొక్క నాటుతున్న ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు

బుచ్చినాయుడుకండ్రిగ: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. మంగళవారం బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చెట్లను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. చెట్లు లేకపోవటంతోనే వర్షాలు పడడం లేదని, ఎండ ఎక్కువ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రవీంద్రనాథ్, ప్రధానోపాధ్యాయులు రమణయ్య, ఏపీఓ భానుప్రియ, ఉపసర్పంచ్ మునిరాజా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సృజనాత్మక బోధన అవసరం



మాట్లాడుతున్న ఎంఈఓ ముని సుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: విద్యార్థులకు సృజనాత్మక బోధన చేయాల్సిన అవసరం ఉందని ఎంఈఓ-2 మునిసుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని నెలవాయి జెడ్పీ పాఠశాలలో జరిగిన సీఆర్పీ సమావేశానికి హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలను బోధించాలని, ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు పాఠ్యాంశాలపై పట్టు కలిగిస్తూ, వారి సామర్థ్యాలకు అనుగుణంగా పాఠ్యాంశాలు బోధన చేసి వారిలో ప్రతిభను వెలికి తీయాలన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి



వినీత్‌కుమార్ (ఫైల్)

ఏర్పేడు: మండలంలోని జంగాలపల్లె చెరువు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఏర్పేడు సీఐ జయచంద్ర కథనం మేరకు.. మండలంలోని జంగాలపల్లె చెరువు సమీపంలో సోమవారం రాత్రి ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు ద్విచక్ర వాహనాల్లోని పుత్తూరు చర్చికాంపౌండ్‌కు చెందిన వినీత్‌కుమార్(22), కృష్ణచైతన్య(25), నారాయణవనం మండలం, వెంకటకృష్ణాపాళెం గ్రామానికి చెందిన ఫిలిప్‌కుమార్ (28)కు గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వినీత్‌కుమార్‌ను మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వినీత్‌కుమార్ మంగళవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

రేపటి నుంచి స్కూల్ గేమ్స్

శ్రీకాళహస్తి రూరల్: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 19 వ తేదీ నుంచి మూడు రోజుల పాటు మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ భువనేశ్వరి తెలిపారు. అండర్-14, అండర్-17 బాల, బాలికల విభాగాల్లో వాలీబాల్, కబడ్డీ, యోగా, ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్ పోటీలు జరుగుతాయన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఇతర వివరాలకు 9985667750 నంబరును సంప్రదించాలన్నారు.

లారీల యజమానులు, డ్రైవర్ల గుర్తింపు

ఏర్పేడు: మండలంలోని వికృతమాల సమీపంలో ఓ ప్రైవేట్ వెంచర్ నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా సీజ్ చేసిన నాలుగు లారీ యజమానులు, డ్రైవర్లను గుర్తించినట్లు ఏర్పేడు సీఐ జయచంద్ర మంగళవారం రాత్రి తెలిపారు. ఆదివారం రాత్రి వికృతమాల వద్ద అక్రమంగా డంపింగ్ చేసిన ఇసుకను జేసీబీ లారీల్లో తరలిస్తుండగా గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నట్లు తెలిపారు. అప్పటికే సంఘటనా స్థలం నుంచి లారీ డ్రైవర్లు, జేసీబీ ఆపరేటర్ పరారయ్యారని పేర్కొన్నారు. అక్కడ ఉన్న నాలుగు లారీలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. మంగళవారం విచారించగా పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూరుకు చెందిన శ్రీనివాసులు, సుందరరామిరెడ్డి లారీ యజమానులుగా, హరికృష్ణ, షేక్ మునాఫ్, అంకయ్య, ఏడుకొండలు లారీ డ్రైవర్లుగా గుర్తించినట్లు వెల్లడించారు. శ్రీకాళహస్తి మండలం, ఊరందూరుకు చెందిన బాలాజీ జేసీబీ ఆపరేటర్ పరారీలో ఉన్నట్లు చెప్పారు. విచారించి తగు చర్యలు తీసుకుంటామని సీఐ చెప్పారు.

పేద విద్యార్థులపై భారం



నేను పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. మా తల్లిదండ్రులకు వ్యవసాయం జీవనాధారం. ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో ఫీజులు తక్కువగా ఉంటాయి. చదువుకునేందుకు వీలుగా ఉంటుంది. ప్రైవేట్ పరం చేస్తే మాలాంటి పేద విద్యార్థులపై ఫీజుల భారం తడిపి మోపెడువుతుంది. దీంతో పేద విద్యార్థులకు వైద్య విద్య అందకుండా పోతుంది.

– చంద్రిక, బైపీసీ విద్యార్థి, పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏర్పేడు మండలం



కల నెరవేరేనా ?



మండలంలోని పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. మా తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. ఇంటర్మీడియట్ బైపీసీ ప్రథమ సంవత్సరంలో 440 మార్కులకు గాను 429 మార్కులు సాధించాను. నీట్ పరీక్ష రాసి ఎంబీబీఎస్ చేయాలనుకుంటున్నాను. ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేయాలనే యోచిస్తోంది. మాలాంటి పేద విద్యార్థులు వైద్య విద్యను అందుకోలేక కలగానే మిగిలిపోతుంది.

– గౌతమి, బైపీసీ విద్యార్థి, పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏర్పేడు మండలం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల తాత్కాలిక భవనం



అసలే అరకొర సిబ్బంది.. ఆపై సొంత భవన వసతి లేమి.. పొరుగు భవనంలో తరగతులు.. అవి కూడా శిథిలం.. పెచ్చులూడుతున్న శ్లాబులు.. ఉరుస్తున్న గదులు.. వెరసి.. వరండాలో చదువులు.. నేలపైనే పరీక్షలు..ఫలితం ఆందోళనల నడుమ సాగని పాఠం. ఇదీ సత్యవేడు డిగ్రీ కళాశాల దుస్థితి.

పెచ్చులూడి పడుతున్న తరగతి గది శ్లాబు



సొంత భవనం..కలాశాల

శిథిల భవనం.. సాగని పాఠం

- వరండా చదువులు.. నేల పరీక్షలు
- శిథిల భవనంలో అవస్థల చదువులు
- ప్రత్యేక లైబ్రరీ కరువు
- క్రీడా మైదానం లేని డిగ్రీ కళాశాల

సత్యవేడు: సత్యవేడు ప్రాంత ప్రజల ఎన్నో ఏళ్లకలను దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి అప్పటి ఎమ్మెల్యే నారాయణస్వామి చొరవతో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశారు. అయితే ఇప్పటి వరకు డిగ్రీ కళాశాలకు భవనం లేకపోవడంతో విద్యార్థులు పొరుగు భవనంలో అరకొర వసతుల నడుమ అవస్థల చదువులు కొనసాగిస్తున్నారు.

వసతుల లేమి..

2008లో డిగ్రీ కళాశాల తాత్కాలికంగా తెలుగుగంగ భవనంలో ప్రారంభించారు. ఏడాది తరువాత స్థలం కేటాయించారు. స్థలం, సొంత భవనాలు వసతి కల్పిస్తామన్నారు. రూ.2 లక్షలు కలెక్టర్ నిధులతో తెలుగు గంగ భవనాలను మరమ్మతులు చేసి, డిగ్రీ కళాశాలకు అప్పగించారు. గంగ భవనాల్లో గదులు చిన్నవిగా ఉన్నా ఆ ఇరుకు గదుల్లోనే విద్యార్థులకు తరగతులు నిర్వహించారు. ప్రస్తుతం మిద్దె పైన గదులు పూర్తిగా పాడైపోయాయి. విద్యార్థులకు ప్రత్యేక లైబ్రరీ వసతి లేక ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ఎకనామిక్స్, బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ కెమిస్ట్రీ తరగతుల్లో 170 మంది విద్యార్థులు ఉన్నారు. పర్మినెంట్ లెక్చరర్లు నలుగురు, కాంట్రాక్టు అధ్యాపకులు ఏడుగురు, గెస్టు ఫ్యాకల్టీ ముగ్గురు ఉన్నారు.

శ్లాబు శిథిలం.. వరండాలో చదువులు

డిగ్రీ కళాశాలలో సుమారు 10 గదులు ఉన్నప్పటికీ మిద్దెపైన ఉన్న గదుల్లో శ్లాబు పెచ్చులూడి పడుతోంది. భవనం శిథిలావస్థకు చేరింది. వర్షానికి శ్లాబు ఉరుస్తుండడంతో గదుల్లోని బెంచీలు పాడైపోయాయి. భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న రూములు, వరండాల్లోనే చదువులు సాగుతున్నాయి. విద్యార్థులకు మరుగుదొడ్లు కూడా లేవు.

క్రీడా మైదానం లేమి..

డిగ్రీ కళాశాలలో క్రీడా మైదానం లేక పోవడంతో విద్యార్థులకు క్రీడల్లో ప్రోత్సాహం కొరవడింది. తరగతులు ముగిసిన వెంటనే విద్యార్థులు ఇళ్లకు పోతున్నారు. 2023లో ఎస్వీయూనివర్సిటీ స్థాయిలో నిర్వహించిన షటిల్ పోటీల్లో సత్యవేడు డిగ్రీ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో ప్రథమ స్థానాన్ని చేతన్(బీకాం), బాబు (బీఎస్సీ) విన్నర్స్‌గా నిలిచారు. ఆట స్థలం ఉంటే వివిధ పోటీల్లో రాణించే వాళ్లమని విద్యార్థులు చెబుతున్నారు.

సెంట్రల్ యూనివర్సిటీకి విద్యార్థిని ఎంపిక

కళాశాలలో 2022-23లో చదివిన టి.పూజ అనంతపురం సెంట్రల్ యూనివర్సిలో ఎమ్మెస్సీ ఎకనామిక్స్ సీటుకు ఎంపికైంది.

మరుగు దొడ్డి లేక ఆరుబయటే..



కళాశాలలో విద్యార్థులకు మరుగుదొడ్డి లేదు. దీంతో విద్యార్థులు(బాలురు) కళాశాలకు దూరంగా ఉన్న జీడిమామిడితోపులోకి బహిర్భూమికి వెళుతున్నారు. బాలికలకు గంగ కార్యాలయం మరుగుదొడ్డి పావడంతో దాతలు రెండు లెట్రిన్లు కట్టి ఇవ్వడంతో బాలికలకు కొంత మేరకు ఇబ్బంది తప్పింది.

– ఎమ్. నవీన్, బీకాం, సత్యవేడు

డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించాలి



డిగ్రీ కళాశాలకు 7.03 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. గత ఏడాది జగనన్న కాలనీల ఏర్పాటు కోసం ప్రభుత్వం డిగ్రీ కళాశాలకు కేటాయించిన స్థలాన్ని ఇచ్చేశారు. నేడు కళాశాలకు స్థలం లేదు. ప్రభుత్వం స్థలం కేటాయించాలి.

– కే. చలపతి, బీకాం, సత్యవేడు

దాతలున్నా స్థలం లేదు



శ్రీసిటీలోని కొన్ని కంపెనీలు డిగ్రీ కళాశాలకు గదులు కట్టించేందుకు ముందుకు వస్తున్నాయి. అయితే కళాశాల నిర్మాణానికి స్థలం లేదు. గతంలో కేటాయించిన స్థలం జగనన్న కాలనీకి కేటాయించి పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ప్రజాప్రతినిధులు డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించి, నూతన భవనం నిర్మించి, మౌలిక వసతులు కల్పించాలి.

– జీ. ధనుష్‌బాబు, బీకాం, సత్యవేడు

పరాశరేశ్వరస్వామికి పవిత్రాల సమర్పణ

నారాయణవనం: స్థానిక టీటీడీ అనుబంధ ఆలయమైన చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి ఆలయంలో మూల, ఉత్సవమూర్తులకు మంగళవారం పట్టు పవిత్రాల సమర్పించారు. ఆలయంలో సోమవారం సాయంత్రం ఆలయంలో పవిత్రోత్సవాలు ప్రారంభమైనాయి. అయ్యప్ప సన్నిధిలో నిర్మించిన యాగశాలలో కలసస్థాపన చేసి శాంతి, వాస్తు, గ్రహ పూజలను, హోమాలను రిత్వికులు నిర్వహించారు. మంగళవారం ఉదయం హోమశాలలో పట్టు పవిత్రాలకు ప్రత్యేక పూజలను నిర్వహించి, పూర్ణాహుతి సమర్పించిన రిత్వికులు పవిత్రాలను ఆలయంలోని మూల, ఉత్సవ విగ్రహాలకు, పరివార దేవతలకు అలంకరించారు. వార, పక్ష, వార్షిక ఉత్సవాలలో జరిగిన పొరబాటులు, ఊరేగింపులో ఉత్సవమూర్తుల అపవిత్ర దోష నివారణార్థం పవిత్రోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. సాయంత్రం చంపకవల్లీ సమేత పరాశురేశ్వరస్వామి అధికార నందివాహనంపై ఊరేగించారు. స్థానిక టీటీడీ ఆలయాల సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న అర్చకుడు

పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. బుధవారం హోమశాలలో పూర్ణాహుతి, ఉత్సవర్ల అభిషేకం అనంతరం పవిత్రాల సమర్పణ నిర్వహిస్తున్నట్లు ఆలయాధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో నిత్య కల్యాణోత్సవంతో పాటు ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు నాగరాజు తెలిపారు.

సైన్స్ ప్రయోగాలకు అధిక ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న అపర్ణ

ఏర్పేడు: సైన్స్ ప్రయోగాలకు ప్రభుత్వ పాఠశాలల్లో అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సీఆర్పీ శిక్షణ రాష్ట్ర పరిశీలకురాలు అపర్ణ అన్నారు. మంగళవారం ఏర్పేడు హైస్కూల్‌లో అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీఆర్పీ పరిధిలోని జీవశాస్త్ర ఉపాధ్యాయులకు అభ్యసన అనుభవంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలు ఇక్కడికే పరిమితం కాకుండా విద్యార్థులకు తరగతి గదుల్లో నేర్పాలని సూచించారు. ఇలాంటి శిక్షణ ద్వారా ఉపాధ్యాయులకు మరింత విజ్ఞానం పెంపొందుతుందన్నారు. అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఎలాంటి లాభాపేక్షలేకుండా ఇలాంటి శిక్షణ ఇవ్వడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ప్రతినిధులు మోహన్, నీరజ,అకడమిక్ మానిటరింగ్ అధికారి శివశంకరయ్య, ఎంఈఓ ప్రేమలత, ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నులిపురుగులను నులిమేద్దాం

సత్యవేడు: నులిపురుగులను నులిమేద్దామని, అప్పుడే పిల్లలను ఆరోగ్యవంతమైన పౌరులుగా ఎదగగలరని క్షయ, కుష్టు నివారణ అధికారి డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి అన్నారు. మంగళవారం దాసుకుప్పం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగులు నివారణకు ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దాసుకుప్పం పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత దూరం

బుచ్చినాయుడుకండ్రిగ: పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయడంతో రక్తహీనత దూరమవుతుందని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వేంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఆయన బుచ్చినాయుడుకండ్రిగ జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, ఎంఈఓ రవీంద్రనాథ్‌లతో కలసి విద్యార్థులకు నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. హెచ్‌ఎం రమణయ్య పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

ఏర్పేడు: నులిపురుగుల నివారణతో పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ మోహనప్రియ అన్నారు. మంగళవారం మండలంలోని ఎండీపుత్తూరులో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం జరిగింది. పంచాయతీ కార్యదర్శి లోకముని, ఎంఎల్‌హెచ్‌పీ దివ్య, ఏఎన్‌ఎం లలిత పాల్గొన్నారు.



సత్యవేడు: దాసుకుప్పంలో విద్యార్థులకు అల్‌బెండజోల్ మాత్రలు వేస్తున్న శ్రీనివాసులురెడ్డి

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

నారాయణవనం: పిల్లలు చదువుతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని మండల వైద్యాధికారి దర్శిత్‌రాజ్ సూచించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మంగళవారం పంపిణీ చేశారు.

ఆల్బెండజోల్‌తో నులిపురుగులు నివారణ

వరదయ్యపాళెం: నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ దివ్య ఔషధమని జిల్లా లెప్రసీ, టీబీ నివారణ వైద్యాధికారి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం చిన్న పాండూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆయన ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక చిన్న పాండూరు ఆరోగ్య సిబ్బంది రవీంద్రనాథ్, పవనకుమారి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



నాగలాపురం:మాట్లాడుతున్న సీడీపీఓ శోభారాణి



సత్యవేడు: మాట్లాడుతున్న సీడీపీఓ దేవకుమారి

నాగలాపురం: పౌష్టికాహారంతో పిల్లలు, గర్భిణులకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ శోభారాణి అన్నారు. మండల కేంద్రంలోని వ్యాపార సంఘం కల్యాణ మండపంలో ఐసీడీఎస్ సీడీపీఓ శోభారాణి ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అలాగే పుట్టిన బిడ్డకు తల్లిపాలు తాగిస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం సీమంతాలు చేసి, అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ చిన్నదొరై సుధా, వైఎస్సార్ సీపీ మండల ప్రధానకార్యదర్శి శ్యామ్, నాయకులు మహేష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగరత్నమ్మ, ఎంపీడీఓ జనార్దనరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారలోపంతోనే రక్తహీనత

సత్యవేడు: పౌష్టికాహార లోపంతోనే రక్తహీనత వస్తుందని సీడీపీఓ దేవకుమారి అన్నారు. మంగళవారం కోటమిట్ట అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ పౌష్టికాహార లోపంతో చిన్నారుల్లో ఎదుగుదల సక్రమంగా ఉండదని చెప్పారు. తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు ఉండే ఆహారం తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ ఏ. చెంచులక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్తలు భవన, సువర్ణదేవి, శశికళ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

సత్యవేడు: సైబర్ నేరాలపై అప్రమత్తతంగా ఉండాల్సిన అవసరం ఉందని శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరావు అన్నారు. మంగళవారం ఆయన సీఐ శ్రీనివాసులుతో కలసి శ్రీసిటీలోని వెర్మిరిన్ పరిశ్రమలో పనిచేసే కార్మికులకు సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళా భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగాలు, లోన్లు, లాటరీల పేరిట మోసపూరిత ప్రకటనలతో సైబర్‌నేరగాళ్లు ఫోన్ కాల్స్, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలను ప్రలోభ పెడుతున్నారన్నారు. నేరాల బారిన పడి మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సామాజిక మాధ్యమాల ద్వారా గుర్తుతెలియని వ్యక్తులు, సెంటర్లు నుంచి వచ్చే మెసేజ్‌లు, లింకులకు స్పందించవద్దన్నారు. ద్విచక్రవాహన చోదకులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ ఎస్ఐ హరిప్రసాద్, శ్రీసిటీ సెక్యూరిటీ హెడ్ వై. రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ

ముక్కంటి సేవలో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొల్లిశెట్టి శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయాధికారులు, జనసేన నాయకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆయన్ని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొట్టే సాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మోదీ జన్మదిన వేడుకలు

వరదయ్యపాళెం: మండల కేంద్రంలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బీజేపీ నేత గుత్తి త్యాగరాజు, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి తడ శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.

శ్రీకాళహస్తి: పట్టణంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ఆధ్వర్యంలో నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

స్వచ్ఛతతో సంపూర్ణ ఆరోగ్యం



నారాయణవనంలో విద్యార్థుల మానవహారం



ఏర్పేడు: పాపానాయుడుపేటలో..

నారాయణవనం: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపవచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మంగళవారం పంచాయతీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ర్యాలీలు, మానవహారాలు, ప్రతిజ్ఞలు చేశారు. మండల కేంద్రమైన నారాయణవనంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణమూర్తి పాల్గొని, మాట్లాడారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో ర్యాలీ చేశారు. కూడలితో మానవహారాన్ని ఏర్పాటు చేసి, ప్రతిజ్ఞ చేశారు. ఈఓపీఆర్డీ డాక్టర్ వేణయ్య పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బుచ్చినాయుడుకండ్రిగ: మన ఇంటితోపాటుగా మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని అంటురోగాలు సోకకుండా చూసుకోవాలని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. మంగళవారం బుచ్చినాయుడుకండ్రిగలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, ఈఓపీఆర్‌డీ రాజశేఖర్, గ్రామ కా ర్యదర్శి ఇందిరమ్మ, ఉపసర్పంచ్ మునిరాజా, సచివాలయ, వైద్య సిబ్బంది, మానవహారం ఏర్పాటు చేశారు.



నారాయణవనం: గ్రీన్ అంబాసిడర్లకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

ఏర్పేడు: వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఎంపీడీఓ గిడ్డయ్య అన్నారు. మంగళవారం మండలంలోని పాపానాయుడుపేటలో స్వచ్ఛత హీ సేవలో భాగంగా ప్రతిజ్ఞ, మానవహారం, ర్యాలీ నిర్వహించారు. ఎండీపుత్తూరులో సర్పంచ్ మోహనప్రియ ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవలో భాగంగా ర్యాలీ మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు హరి, లోకముని, హెచ్‌ఎం సునీత పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవతో శుభ్రత

వరదయ్యపాళెం: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం ద్వారా పరిసరాల పరిశుభ్రతగా ఉంచుకోవాలని ఎంపీడీఓ ప్రసాద్ సూచించారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా వరదయ్యపాళెం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి బస్టాండ్ ఆవరణలో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ చిరంజీవి, పంచాయతీ ఈఓ బసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత

శ్రీకాళహస్తి: పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత అని కడప జోన్ ఈడీ చెంగల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం స్వచ్ఛతే ఈ సేవ పక్షోత్సవాలను నిర్వహించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో మేరీ లైఫ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు కళాశాల ప్రాంగణం, తరగతి గదులను శుభ్రం చేశారు. ప్రిన్సిపల్ ఎం.శ్రీలత, అధ్యాపకులు సుధీర్, తదితరులు పాల్గొన్నారు.



వరదయ్యపాలెంలో..



ఎండీపుత్తూరులో..



బుచ్చినాయుడుకండ్రిగలో..



కార్మికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు